క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రాకతో క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీచ్‌లో సందర్శకుల సందడి


కేపీ పాలెం బీచ్‌లో సేదతీరుతున్న సందర్శకులు

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి ఎండతో పాటు ఉక్కబోతగా ఉండటంతో పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం తీరంలోని వేంకటేశ్వరస్వామి, వేలాంకణీ మాత, పాండురంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మీ అమ్మవారి ఆలయాలను దర్శించుకున్నారు.

వృద్ధురాలికి ఆర్థిక సహాయం


ఆర్యపేటలో వృద్ధురాలికి ఆర్థిక సహాయం అందిస్తున్న మానుకొండ సోమరాజు

యలమంచిలి: ఆర్యపేట గ్రామానికి చెందిన చింతా పాపాయమ్మ వృద్ధాప్యంతో అనారోగ్యానికి గురై బాధపడుతున్నారు. జీవనం కష్టమవడంతో తన కష్టాన్ని గ్రామానికి చెందిన తరపట్ల మిథున్ చక్రవర్తి, రాపాక ఆదంప్రసాద్‌లకు చెప్పుకుని, ఆర్థిక సహాయం చేయమని కోరుకుంది. వారిద్దరు కువైట్‌లో ఉంటున్న వారి మిత్రులకు విషయం చెప్పారు. దీంతో గొల్లమందుల రవి శేకర్, ఈద రాజు, రాపాక ఆదంప్రసాద్, ఎస్ఎస్ లత స్పందించి రూ.10 వేలు నగదు పంపారు. వాటిని ఆదివారం ఆర్యపేటలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మానుకొండ సోమరాజు, రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్ చేతుల మీదుగా బాధిత మహిళ పాపాయమ్మకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడి సహదేవ్, కొయ్యి ఈశ్వర్, రాపాక సూర్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు ఇన్వర్టర్ అందజేత


ఎలక్ట్రికల్ ఇన్వర్టర్‌ను సీఐకి అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఇన్వెర్టర్‌ను రోటరీ క్లబ్ సభ్యులు బహూకరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేసిన సమయంలో టెక్నికల్‌గా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దాంతో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహనరావు, మద్దాల రాంప్రసాద్, వాసు సోదరులు రూ. 18 వేలతో ఎలక్ట్రికల్ ఇన్వర్టర్, బ్యాటరీని సీఐ దారావత్తు రాంబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రావాడ సతీష్, కానూరి ప్రభాకర్, చందక రాము తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 4 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలో అక్టోబరు 4 నుంచి ప్రారంభమయ్యే జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎల్బీచర్ల పీహెచ్‌సీ డాక్టర్ నిహారిక సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంద్వారా ప్రతీ ఒక్కరికీ వైద్యసేవలు అందిస్తామన్నారు. ఇప్పటికే గ్రామాల వారీగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య సర్వే చేస్తున్నారు. ఈ సర్వేలో భాగంగా బీపీ, సుగర్, హెచ్‌బీ, యూరిన్, కళ్ల పరీక్ష తదితర 7 రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారన్నారు. 30ఏళ్ల పైబడిన వయస్సు కలిగిన వారందరికి వైద్యపరీక్షలు చేస్తున్నారన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులతో వైద్యసేవలను అందిస్తామని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభానికి వడివడిగా అడుగులు

- వారం రోజుల్లో రానున్న వాటర్ టెస్టింగ్ రిపోర్టులు
- నూతన ఫిల్టర్ ప్లాంట్ కెపాసిటి 1.1 కోట్ల లీటర్లు
- తీరనున్న పట్టణ శివారు ప్రాంత ప్రజల తాగునీటి సమస్య


నూతన వాటర్ ఫిల్టర్ ప్లాంట్

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణ శివారు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు అతి త్వరలో తాగునీటి సమస్య పరిష్కారం కానుంది. పట్టణంలో సుమారు 30 వేల జనాభా ఉన్న సమయంలో నిర్మించిన ఫిల్టర్ బెడ్ సుమారు లక్ష జనాభాకు చేరుకున్న సమయంలోనూ నేటికీ ఇదే ఫిల్టర్ బెడ్ ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. దానితో శివారు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు తాగునీరు ప్రధాన సమస్యగా మారింది. దాంతో సుమారు రూ. 15 కోట్లతో నూతన ఫిల్టర్ బెడ్‌ను ప్రారంభించగా ప్రస్తుతం పనులు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతం నూతన ఫిల్టర్ బెడ్ నుంచి వచ్చే నీటిని పరీక్షలకు పంపించారు. ఆ రిపోర్టులు వచ్చిన వెంటనే అక్టోబర్ నెలలో ప్రారంభోత్సవం చేసేలా కృషి చేస్తామని ఇంజినీరింగ్ అధికారులు చెపుతున్నారు.


వాటర్ ప్లాంట్‌ను పర్యవేక్షిస్తున్న ఎస్ ఈ సుధాకర్, డిఈ విజయ్‌లు

మనిషికి 135 లీటర్లు

ఇంజినీరింగ్ అధికారుల లెక్క ప్రకారం ప్రతీ మనిషికి 135 లీటర్లు తాగునీటిని అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతంఉన్న పాత ఫిల్టర్ బెడ్ ద్వారా 90 లక్షల లీటర్లు సరఫరా అవుతుంది. పట్టణంలో జనాభా సుమారు లక్షకు చేరుకోవడం అంతేకాకుండా పట్టణ పరిసర గ్రామాల ప్రజలు సైతం టిన్‌లతో తాగు నీళ్లు పట్టుకుని వెళుతుంటారు. దాంతో తాగునీటి సమస్య మరింత ఎక్కువగా ఉంది. నూతన ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.15 కోట్లు కేటాయించింది. ఈ నూతన ఫిల్టర్ ప్లాంట్ సామర్థ్యం రోజుకు కోటి 10లక్షల లీటర్లు అందిస్తుంది. రెండు ఫిల్టర్ ప్లాంట్‌ల ద్వారా రోజుకు మొత్తం 2 కోట్ల లీటర్లు తాగునీరు సరఫరా అవుతుంది. శివారు ప్రాంతాల్లో నీటిని అందించడానికి హౌసింగ్ బోర్డు కాలనీలో, బెత్లహంపేటలో రెండు చోట్ల ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లు నిర్మించారు. వీటికి 30 హెచ్‌పీ మోటర్లు పదివరకూ అమర్చారు. ఈ నూతన ప్లాంట్ ప్రారంభం అవ్వడంతో శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఎప్పటి నుంచో పెద్ద సమస్యగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది. గత వారం రాజమండ్రి పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ సుధాకర్ పట్టణంలో నూతన వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌ను పరిశీలించి పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రారంభానికి సిద్ధం

నూతన వాటర్ ప్లాంట్ అక్టోబర్ నెలలో ప్రారంభించడానికి ప్రయత్నం చేస్తున్నాం. ప్లాంట్ పనులు మొత్తం పూర్తయ్యాయి. వాటర్ టెస్టింగ్‌కు ఏలూరు ఐపీఎం ల్యాబ్‌కు పంపించాం. వారం రోజుల్లో ఆ రిపోర్టులు వస్తాయి. ఫిజికల్, కెమికల్, బ్యాక్టీరియాలాజికల్ పరీక్షలు చేసి క్లోరైడ్, సల్‌ఫేట్ ఎలా ఉన్నది, ఎంత ఉన్నది రిపోర్టులు వచ్చిన తరువాత అక్టోబర్ నెలలో తేది నిర్ణయించి ప్రారంభిస్తాం.
– సుధాకర్, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ, రాజమండ్రి

అర్హులందరికీ ఇంటి స్థలాల అందజేత

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు


గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 5వ వార్డులో పర్యటిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: సొంత ఇల్లు లేకుండా అర్హులై ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే ఇంటి స్థలం ఇస్తామని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు చెప్పారు. ఆదివారం ముదునూరి రెండవ విడత గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 5వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలనే ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టిందని చెప్పారు. ఇప్పటికే పట్టణంలో ఆరు వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. ఇంకా లబ్ధిదారులు ఉంటే వెంటనే ఇంటిస్థలం ఇవ్వడమే కాకుండా, ఇల్లు నిర్మించి ఇస్తామని పేర్కొన్నారు. అయితే ఇంటి స్థలం తీసుకున్నవారు ప్రభుత్వ సహకారంతో వెంటనే ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. ఒక్క 5వ వార్డులోనే ఈ నాలుగున్నరేళ్లలో రూ.19.28 కోట్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు పెట్టామని వివరించారు.

అడుగడుగునా సమస్యలు తెలుసుకుంటూ

ముదునూరి ప్రతీ గడపకూ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించడంతో పాటుగా ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం దిశగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వర్షాలతో రోడ్లు నీట మునుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. వెంటనే సమస్య పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కరెంట్ తీగలను ఆనుకుని ఉన్న చెట్లు కొమ్మలు తొలగించాలని ఆదేశించారు. ఖాళీ స్థలాలను యజమానులు శుభ్రం చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఫిర్యాదు చేయడంతో సంబంధిత యజమానులకు నోటీసులు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావును ఆదేశించారు.

స్నాన ఘట్టాలు మరమ్మతులు చేయాలి

కార్యక్రమంలో భాగంగా వార్డులో మున్సిపల్ అధికారులు, వలంటీర్లుతో సమీక్ష నిర్వహించారు. వార్డులో గోదావరి పాడువునా రానున్న కార్తీక మాసం పురస్కరించుకుని తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇసుక ర్యాంపు నుంచి కొండాలమ్మ గుడి వరకూ లైటింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. గోదావరి స్నాన ఘట్టాలను మరమ్మతులు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు, కౌన్సిలర్లు వైకేఎస్, పతివాడ మార్కెండేయులు, వల్లభాని శేఖర్, పప్పుల రామారావు, మల్లాడి బుజ్జి, సోమరాజు భరత్, కేసరి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజల ముంగిటకే పాలన

ఆకివీడు: ఉండి మండలంలోని మహాదేవపట్నంలో సచివాలయం-1, -2 భవనాలను, రెండు ఆర్బీకే భవనాలను రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాస్‌చంద్ర బోస్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మీ, చినమిల్లి వెంకట రాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకు వచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. రైతులు, గ్రామీణ ప్రజలు ఆసుపత్రులకు, రైతు అవసరాలను పల్లెల్లోనే తీర్చుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేశారని చెప్పారు. రైతులకు సబ్సిడీలపై పనిముట్లు, రోగులకు ఉచితంగా పరీక్షలు, మందులు అందుబాటులో ఉంటున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలన పల్లెల్లోనే కొనసాగుతోందన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్యంలో పల్లెలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉంటే, జగన్ ప్రభుత్వంలో పల్లెలు ప్రగతిపథంలో నడుస్తున్నాయని చెప్పారు. అధికారులు, సిబ్బంది ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యల్ని పరిష్కరిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వాల పాలనలో పంచాయతీలకు భవనాలు లేక అద్దె ఇళ్లల్లో గడిపేవారన్నారు. పంచాయతీ కార్యాలయాల్లో సిబ్బంది ఉండేవారు కాదని, గ్రామ సింహాలే అక్కడ నిద్రపోయేవని ఎద్దేవా చేశారు. గ్రామ సచివాలయాలు సిబ్బందితో, ప్రజలతో సందడిగా ఉన్నాయని చెప్పారు.

కాలేజీ విద్యార్థులతో రాజకీయాలు సిగ్గుచేటు


ఉచ్చుల స్టాలిన్

యలమంచిలి: పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు కాలేజీలకు వెళ్లి విద్యార్థులతో రాజకీయాలు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన నాయకులు ఉచ్చుల స్టాలిన్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్వతహాగా అధ్యాపకుడైన రామానాయుడు ఒక అవినీతిపరుడిని బలపరచమని కాలేజీలకు వెళ్లి విద్యార్థులను కోరడం కంటే సిగ్గుమాలిన పని మరొకటి ఉండదని ఎద్దేవా చేశారు. చదువుకునే విద్యార్థులకు ఏ ప్రభుత్వంలో న్యాయం జరిగిందో వారికే తెలుసని పేర్కొన్నారు. అలాంటి విద్యార్థులను తన గారడీ మాటలతో మాయ చేయాలనుకోవడం రామానాయుడు అవివేకమని విమర్శించారు. స్కిల్ స్కాంలో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబుకు పార్టీ కార్యకర్తల నుంచి మద్దతు లేకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్న రామానాయుడు చివరకు విద్యార్థుల వద్దకు వెళ్లి తన డ్రామాలకు తెరతీసాడని స్టాలిన్ ఎద్దేవా చేశారు.

మానవత సంస్థ ఆర్థిక సహాయం


పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

పెనుమంట్ర: విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో మానవత చేస్తున్న ప్రోత్సాహం మరువలేనిదని కుంగ్‌ఫూ మాస్టర్ అరటికట్ల శ్రీనివాస ప్రభు అన్నారు. మానవత సంస్థ నెలవారీ సమావేశం జిల్లా అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన మార్టేరు మానవతా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులు కె.రాజేష్, ఎలమర్తి దీపకలకు రూ. 5 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ప్రత్యేక అతిథి జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి వేణుబాబు మాట్లాడుతూ ఇతరలకు మనల్ని ఆదర్శంగా చూపించేది మన గెలుపు అయితే దైవంగా చూపించేది సేవ మాత్రమే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చిర్ల చినసూర్యనారాయణరెడ్డి, సూర్యతేజ, సత్తి సత్యనారాయణరెడ్డి, సెక్రటరీ బండి ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ కర్రి కృష్ణారెడ్డి, చిర్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

క్రిస్టియన్ పేట వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిన్ని పీటర్ సన్


చిన్ని పీటర్‌సన్‌ని అభినందిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని క్రిస్టియన్ పేట వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడుగా చిన్ని పీటర్‌సన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సంఘ సర్వసభ్య సమావేశంలో ఉపాధ్యక్షుడుగా మందా రాజా, కార్యదర్శి బూసి రాజేష్, జాయింట్ సెక్రటరీ డేనియల్‌రాజు (పెద్దరాజు), కోశాధికారి అరుణ్ (రింకు), సహాయ కోశాధికారి కాకిటి రంజిత, గౌరవ అధ్యక్షుడుగా మహ్మద్ హారీం, సభ్యులుగా సవరపు సాలేము, లంకా భాస్కరరావు, కొడవల్లి కమలాకర్, కొడవల్లి ఫెడ్రిక్ (చంటి), జుత్తిగ జవహార్, సలాది సందీప్, జుత్తిగ సుధీర్ (బాబి), ఖండవల్లి రవి, సలాది రాజబాబు ఎన్నికయ్యారు. నూతన కమిటీని సంఘ సభ్యులు పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

బైబై గణేశా


మొగల్తూరు: గాంధీ బొమ్మల సెంటర్లో నిమజ్జనోత్సవంలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు


పాలకొల్లు సెంట్రల్: లక్ష్మీ గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు


పెనుగొండ: వడలి గౌడ సంఘం ఆధ్వర్యంలో గణపతి నిమజ్జనోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


యలమంచిలి: మేడపాడు ఆంజనేయస్వామి గుడి వద్ద ఏర్పాటుచేసిన వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

మొగల్తూరు: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని ఆదివారం ఏడో రోజున వినాయక నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని శేరేపాలెం, కేపీపాలెం, రామన్నపాలెం గ్రామాలతో పాటు స్థానిక గాంధీ బొమ్మల సెంటర్లో ఆటో డ్రైవర్లు ఏర్పాటు చేసిన వినాయకున్ని, వెలిదివారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయకున్ని గ్రామంలో ఊరేగించి నిమజ్జనాలు చేశారు. మొగల్తూరులో ఆటో డ్రైవర్లు ఆధ్వర్యంలో తీన్‌మార్ డప్పులు, బాణ సంచా కాల్పులతో గ్రామంలోని వినాయకుడిని పలు వీధుల గుండా ఊరేగించారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం

పాలకొల్లు సెంట్రల్: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలు గణపతి మండపాల్లో లక్ష్మీగణపతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక 17వ వార్డులో గణపతి మండపం వద్ద లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. భక్తులు ఈ హోమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హోమం అంతరం స్వామి వారిని నిమజ్జనం నిమిత్తం పట్టణ పురవీధుల్లో మేళతాళాలతో అంగరంగ వైభవంగా ఊరేగించారు. స్థానిక బుధవారపు వీధిలో ఏర్పాటుచేసిన గణనాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కుంపట్ల రామ్‌గోపాల్, మానేపల్లి వెంకటేశ్వరరావు, మండెల రాధ, కర్రె రవి తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: గణపతి నిమజ్జనోత్సవాలుజోరుగా కొనసాగుతున్నాయి. పెనుగొండ, ఆచంట మండలాల్లో నిమజ్జనోత్సవాలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం వడలిలో తూర్పు వీధి గౌడ సంఘం ఆధ్వర్యంలోనూ, పెనుగొండ దొంగగూడెంలోనూ, వెలమ సంఘం ఆధ్వర్యంలోనూ నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆయా కమిటీ సభ్యులు పూజలు నిర్వహించి, గ్రామోత్సవాలు నిర్వహించారు. ఆదివారం కావడంతో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం వరకూ గ్రామోత్సవాలు నిర్వహించి, పెనుగొండ నరసాపురం కాలువలోనూ, సిద్ధాంతం కేదారీఘాట్ వద్ద వశిష్టా గోదావరి వద్ద నిమజ్జనాలు నిర్వహించారు.

యలమంచిలిలో..

యలమంచిలి: వినాయకచవితి నవరాత్రి వేడుకలను గ్రామాలలో భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. వినాయకుని విగ్రహం వద్ద జంటలతో పండితులు శాస్త్రోక్తంగా పూజలు చేయిస్తున్నారు. ఈ సందర్భంగా చవితి పందిర్ల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మేడపాడు ముద్దల వారి వీధిలో కోలాట భజన చేశారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మార్టేరులోని జడ వంతెన వద్ద ఉన్న భక్తాంజనేయ స్వామి గుడి వద్ద గణపతి ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో 7వ రోజు ఆదివారం చిర్ల కృష్ణారెడ్డి, కృష్ణ శిరీషా దంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణపతిని ముత్యాల పల్లకీలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు పల్లకీ సేవ గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అలాగే వెలగలేరు శివాలయం వద్ద వెలగలేరు యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపతికి గరికతో పూజలు చేశారు.

నేడు వినియోగదారుల సమావేశం

పాలకొల్లు సెంట్రల్: వినియోగదారుల సమస్యలపై సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు వినియోగదారుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి ముచ్చర్ల వీరాస్వామి నాయుడు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ, పౌర సరఫరాల శాఖ ఆదేశానుసారం సోమవారం ఉదయం 11 గంటలకు పట్టణంలో వీరావారి వీధిలో వినియోగదారుల మండలి కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సభ్యులందరూ ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

దూరవిద్య ప్రవేశాలకు గడువు పెంపు

మొగల్తూరు: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ చేరాలనుకునే వారికి ఫీజు గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు విద్యాపీఠం మండల కోఆర్డినేటర్, స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ధమాని రవి శంకర సర్కార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతిలో చేరేందుకు ఎటువంటి విద్యార్హత లేదని 14 సంవత్సరాలు వయస్సు దాటి ఉండాలని, ఇంటర్మీడియట్ చేరే వారు పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వారి సచివాలయంలోని విద్యా సంక్షేమ సహాయకులను సంప్రదించాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ సమావేశం

యలమంచిలి: యలమంచిలి గ్రామ వైఎస్సార్ సీపీ కమిటీ సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ రావూరి వెంకటరమణ స్వగృహంలో ఏర్పాటు చేసినట్లు పార్టీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, జేసీఎస్ కన్వీనర్ ఓదూరి భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఈ కార్యక్రమానికి హాజరవుతారని పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.